RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 255 | మంగళవారం, ఫిబ్రవరి 24 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మినారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్దం కండి

**రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి**

**దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం**

**డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి**




**వికారాబాద్,ఫిబ్రవరి23:** రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. మిగతాది 2లో...

## దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

**సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం**

**మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి**

**అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల**



**వాషింగ్టన్,ఫిబ్రవరి23:** దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. మిగతాది 2లో...

## పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం -పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన**

**హైదరాబాద్,ఫిబ్రవరి23:** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్ధిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. మిగతా 2లో...



## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

**విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ**

**జిఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం**

**ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క**

**హైదరాబాద్,ఫిబ్రవరి23:** అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, మిగతాది 2లో...



## బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్

**రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు**



**అమరావతి,ఫిబ్రవరి23:** రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, మిగతా 2లో...

## సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత**

**కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23:** మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనా పరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం మిగతా 2లో...



## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**

**భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ**

**నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత**





## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

**పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం**

**పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి**

**ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం**



**హైదరాబాద్,ఫిబ్రవరి23:** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్ర మాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని మిగతా 2లో...

## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

**ఇప్పటికే నలుగురు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం**

**పాలవ్యాపారి గణేశ్ అరెస్ట్.. పరీక్షలకు పాల నమూనాలు**

**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23:** రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో మిగతాది 2లో...



## హైదరాబాద్ మెట్రో పూర్తిగా ప్రభుత్వ స్వాధీనం

**ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం**

**రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం**



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

**(మొదటి పేజీ తరువాయి**

ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ పక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ పక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్దీ దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4-10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**(మొదటి పేజీ తరువాయి**

భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలి పోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

**(మొదటి పేజీ తరువాయి**

వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి




దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ఃఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**(మొదటి పేజీ తరువాయి**

సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

**(మొదటి పేజీ తరువాయి**

గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లీష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# బీహార్‌లో ఐపీఎస్ అధికారిసునీల్ నాయక్ అరెస్ట్

**(మొదటి పేజీ తరువాయి**

ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

# తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

**(మొదటి పేజీ తరువాయి**

పవన్ కల్యాణ్ నిర్ణయించారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు.జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

# రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

**(మొదటి పేజీ తరువాయి**

మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణెళిష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

# హైదరాబాద్ మెట్రోపూర్తిగా ప్రభుత్వ స్వాధీనం

హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

# జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు.

కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కచ్చీర్ కాడి ముచ్చట్లు.



ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితం

సుప్రీంకోర్టు..ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ప్రజల కష్టార్జితం ఉంది...

సంపన్నులకు ఉచితాలెందుకు? అంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందివిధితమే.దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది.సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రధానాంశాలు:సంపన్నులకు ఉచితాలెందుకు?: పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించడం గమనార్హం.ఎన్నికల తాయిలాలు: ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది.ప్రజల పన్నుల సొమ్ము: ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది.అభివృద్ధికి నిధులేవి?: రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది.అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

చెప్పాల్సింది చాలా ఉంది...
చదవాల్సింది మిగిలే ఉంది..

సకినాల సుధాకర్ పటేల్
సీనియర్ జర్నలిస్టు

## కోరుకొండలో కల్తీ పాలు విషాదం -- బాధిత కుటుంబాలకు ఆర్‌పీఐ(అంబేద్కర్) ప్రగాఢ సానుభూతి

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ విజయవాడ**
తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలో కల్తీ పాలు సేవించడం వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షుడు మరియు జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ గారు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:ిఁ "కల్తీ పాలు వంటి అమానుష చర్యల వల్ల నిరపరాధులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు -- ఘోర నేరం. బాధిత కుటుంబాల పట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించడంతో పాటు, ఒక కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తున్నాము. వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలి."కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుని, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ పిట్టా వరప్రసాద్ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.
అమాయక ప్రజల ప్రాణాలతో ఆటలాడే వారిని కఠినంగా శిక్షించాలి అని రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర డాక్టర్ అధ్యక్షుడు పిట్ట వర ప్రసాదు స్పష్టం చేశారు

## దేవరకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యం



**హైదరాబాద్ ఎస్టేట్ దేవరకొండ ప్రతినిధి:-** కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ వస్కుల కృష్ణయ్య నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశానికి ముఖ్యఅతిథిగా నల్లగొండ పార్లమెంట్ అధ్యక్షులు కసిరెడ్డి శేఖర్ రెడ్డి హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నుండి పలోపేతం చేయడం మన లక్ష్యం అని పేర్కొన్నారు రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులు ఐక్యమత్యంతో పని చేయాలని అని అన్నారు వారితోపాటు టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పోల్కంపల్లి అశోక్ కుమార్ కానిపాక బోర్డు మెంబర్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ కుమార్ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవులు సమావేశానికి పాల్గొని పార్టీ బలోపేతం కీలక నిర్ణయాలపై పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు ఆదేశాల మేరకు దేవరకొండ నియోజకవర్గం లోని మండలాల సంబంధించిన అధ్యక్షులు కార్యదర్శులు మరియు మండల కార్యవర్గ సభ్యులు ఎంపిక ప్రక్రియ సమావేశం చేయడం జరిగింది ఎంపిక చేసిన సభ్యుల జాబితాను అధిష్టానం నుండి అనుమతి రాగానే అధికారంగా మండల కమిటీలను ప్రకటిస్తామని నాయకుడు వెల్లడించారు ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నల్గొండ పార్లమెంట్ అధ్యక్షులు వస్కుల రాజేష్ ఉప్పల రమేష్ విజయ్ కుమార్ సీతారాములు ఎల్లేటి నరసింహ గడ్డం శ్రీధర్ బోడ ధన్నయ్య తోటి సంతోష్ శ్రీధర్ కనకచారి గిరి సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామ అభివృద్ధి కోసం సొంత గూటికి సత్తెన్న

- కందుకూరు మండలం నుంచి కాంగ్రెస్ లో చేరికలు .
- కార్యకర్తల బలంతో వచ్చే ఎన్నికల్లోనూ విజయం:
- కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం గడ్డ కాంగ్రెస్ అడ్డ

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కందుకూరు సీనియర్ నాయకులు, మహేశ్వరం నియోజకవర్గం తెలంగాణ జాగృతి ఇన్చార్జి అందు గుల సత్యనారాయణ సహా పలువురు కాంగ్రెస్ లో చేరారు.ఈ సందర్భంగా ఖూ= మాట్లాడుతూ... కార్యకర్తల బలం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు.పార్టీని వీడిన నాయకులు మళ్లీ కాంగ్రెస్ లో చేరటం సంతోషమన్నారు. అందుగుల సత్య నారాయణ సహా మహిళలు, యువకులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కిచ్చెన్న హామీ ఇచ్చారు. పంచాయతీలు, పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.వచ్చే ఎన్నికల్లో హస్తం పార్టీ



నాయకులకే పట్టం కట్టాలని లక్ష్మారెడ్డి కోరారు. అందుగుల సత్యనారాయణ మాట్లాడుతూ మహేశ్వరం గడ్డ కేఎల్ఆర్ అడ్డా ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి.

# పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేయాలి

- గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్
- మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్
- మేనిఫెస్టో లో హామీ ఇవ్వడం .వైద్య శిబిరంలో

సర్పంచ్ కృష్ణ గౌడ్ , తదితరులు

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు, మండల బైరగూడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందిం చడానికి కృషి చేయాలని బైరాగి గూడ గ్రామ పంచా యతీ సర్పంచ్ పల్సా కృష్ణ గౌడ్ తెలిపారు మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వాలు నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరంలో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జరిగిన ముగింపు సమావే శంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను



సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రైవేట్ ఆసుపత్రుల కంటే



ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను సీఎం రేవంత్ రెడ్డి తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్య క్రమంలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని

- -రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆలేటి ఎల్లయ్య

**హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఎల్బీనగర్**
ఈరోజు అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సి.పి.ఎం డిమాండ్ వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలో కార్మికుల్ని, పేదలని, అందరినీ సమీకరించి సిపిఎం పార్టీ ఎల్బీ నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలతో జనరల్ బాడీ సమా వేశం పో ట్టేపాకు రామస్వామి. పోలే రమేష్ అధ్యక్షతన నిర్వహి ంచడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 74 సంవత్సరాలు గడుస్తున్న నేటికి ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ఇండ్లు ఉన్న స్థలాలు లేకపోవడం బాధాకరమని అన్నారు రాజకీయ అండదండలతో కొంతమంది రియల్ ఎస్టేటారస్తులు రాజకీయ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిఈ ప్రాంతంలో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎన్నో సంవత్సరాలగా పోరాడుతుంటే ప్రభుత్వాలు మారుతున్న ప్రజల బతుకులు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



లేనియెడల ప్రభుత్వ భూములన్నీ కబ్జాదారుల చేతిలోకి వెళ్లిపోయి కబ్జాలు చేస్తూ పెద్ద పెద్ద బిల్డింగులు కడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం గా మారుతూ మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ ప్రాంతంలో ఎక్కడ,ఉన్న ప్రభుత్వం భూమి, గుర్తించి అర్హులైన పేద ప్రజలకు పేదలందరికీ ఇళ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,లేనియెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలే రమేష్. ప్రణయ్. రాజేశ్వరి. శ్రావణి. సైదమ్మ. మహిళలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో భోజనంపై విద్యార్థినుల ఆందోళన

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆకస్మిక తనిఖీ, అధికారులకు

కఠిన ఆదేశాలు..

ఎమ్మెల్యే సందర్శనతో ఆందోళన విరమించిన విద్యార్థినిలు..

**హైదరాబాద్ ఎస్టేట్ 23 02 2026 సోమవారం పాలకుర్తి.**
పాలకుర్తి మండలంలోని గూడూరు ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో సరైన భోజనం అందించడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినులు సోమవారం హాస్టల్ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. మెనూ ప్రకారం ఆహారం ఇవ్వడం లేదని, నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని, పలు రోజులుగా సమస్యను తెలియజేసినా పరిష్కారం కాలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆరోగ్యం దెబ్బతింటోందని, చదువుపై కూడా ప్రభావం పడుతోందని వారు పేర్కొన్నారు.విషయం స్థానిక శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి దృష్టికి వెళ్లగా వెంటనే స్పందించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించిన వారు, నేరుగా విద్యార్థినులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఒక్కో విద్యార్థినితో మాట్లాడి భోజన నాణ్యత, మెనూ అమలు, వసతి సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం హాస్టల్ వంటశాలను పరిశీలించి, ఆ రోజు సిద్ధం చేసిన భోజనాన్ని తనిఖీ చేశారు. బియ్యం, కూరగాయలు, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, సరఫరా రికార్డులు, హాజరు పట్టికలు తదితర పత్రాలను కూడా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే గూడూరు హాస్టల్ పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియజేశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించడం ప్రభుత్వం బాధ్యత అని స్పష్టం చేశారు. తక్షణమే విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.విద్యార్థుల ఆరోగ్యం, చదువు విషయంలో





ఎలాంటి రాజీ ఉండదు. ప్రభుత్వ పథకాల అసలు ఉద్దేశ్యం విద్యార్థుల సంక్షేమం. అందుకు అనుగుణంగా హాస్టళ్లలో ఆహారం, వసతి, పరిశుభ్రత విషయంలో ప్రమాణాలు తప్పక పాటించాలి అని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఇకపై హాస్టల్ నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎమ్మెల్యే తక్షణ స్పందనతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రత్యక్షంగా విని, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

# సమీకృత సముదాయ సమావేశ మందిరం ప్రజావాణికి (43) ఫిర్యాదులు





**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-**
రంగారెడ్డి జిల్లా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (43) ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు. రెవెన్యూ శాఖ-- 22, ఇతర శాఖలు -- 21, మొత్తం 43 దరఖస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికా రులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని గ్రామస్తుల ఆవేదన



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండల కేంద్రంలో నంది వనపర్తి వెళ్లే మార్గంలో రోడ్డు ఎంతో అధ్వానంగా మారింది. అక్కడ నివసించే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా రోడ్డు దుమ్ము ధూళి నిండి ప్రజల ఇళ్లల్లోకి చేరి వారు అనారోగ్య బారిన పడే పరిస్థితి ఏర్పడింది అని బీఆర్ఎస్ పార్టీ యాచారం మండల యూత్ అధ్యక్షులు సయ్యద్ జానీ తీవ్రంగా ఖండించారు. ఇక్కడ ఉన్నటువంటి అధికారులు ఏ మాత్రం చొరవ తీసుకోకుండా దాదాపు 5 సంవత్సరాలు కావస్తున్నా రోడ్డు పనులు ఎవరూ పట్టించుకోవడం లేదు, స్థానికంగా ఉన్నటువంటి ఎమ్మెల్యే చాలా సార్లు నంది వనపర్తి గ్రామానికి వారు వెళ్లడం జరిగింది . అదే రోడ్డు మార్గాన వెళ్లినా కూడా రోడ్డుని సరైన రీతిలో చేసి వాడకలోకి తీసుకొద్దాం ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేద్దామనే ఒక ఆలోచన లేకుండా దాన్ని అలానే వదిలిపెట్టడం సరైనది కాదని ఆయన వెల్లడించారు. కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్థానికంగా ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు దీన్ని పట్టించుకోని రోడ్డు పనులు త్వరగా చేయవలసిం దిగా కోరుతున్నాము. లేని పక్షాన తీవ్ర స్థాయిలో పరిణామం ఉంటుందని హెచ్చరించారు.

# రేవంత్ సర్కార్‌కు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి

**- మహేశ్వరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.**
**- శంకర్పల్లిలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఘాటైన వ్యాఖ్యలు.**



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-**
చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని శంకర్పల్లి మున్సిపాలిటీ, శంకర్పల్లి టౌన్‌లో ఉన్న సిటిజన్ ప్యాలెస్లో నిర్వహించిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశంలో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వివిధ రాజకీయ పార్టీల నుంచి మాజీ మంత్రి సబితా ఇంద్రరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ,"ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది. ప్రజావ్యతిరేక విధానాలతో నడుస్తున్న ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. కచ్చితంగా రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారం లోకి రానుంది," అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# దివ్యాంగుల చెంతన జన్మదిన వేడుకలు




**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)**
మండలపరిదిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుండాల నవీన్ – స్వాతి దంపతుల కుమార్తె సుదీక్ష 2వ జన్మదిన వేడుకలు దివ్యాంగుల చెంతన ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి జన్మదిన వేడుకలు అనాదాశ్రమం లో నిర్వహించామని, 2వ జన్మదిన వేడుకలు సూర్యాపేట లో కాసరాబాద్ రోడ్డు కు గల అపూర్వ దివ్యాంగుల మానసిక వసతి గృహంలో వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ లాంటి వేడుకలు నిరుపేదలు, అనాదల మధ్య జరుపుకోవడం మంచిది అన్నారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి , పాఠ్యపుస్తకాలు ,నోట్ బుక్స్, మరికొన్ని స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి యం పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుండాల లింగయ్య యాదవ్, పద్మ , కేతమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-**
రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం తేదీ:23/2/26 అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని. సిపిఎం డిమాండ్ వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలో కార్మికుల్ని, పేదలని, అందరినీ సమీకరించి సిపిఎం పార్టీ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలతో జనరల్ బాడీ సమావేశం పో ట్టేపాకు రామస్వామి. పోలే రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 74 సంవత్సరాలు గడుస్తున్న నేటికి ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ఇండ్లు ఉన్న స్థలాలు లేకపోవడం బాధాకరమని అన్నారు. రాజకీయ అండదండలతో కొంతమంది రియల్ ఎస్టేపారస్తులు రాజకీయ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిఈ ప్రాంతంలో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎన్నో సంవత్సరాలగా పోరాడుతుంటే ప్రభుత్వాలు మారుతున్న ప్రజల బతుకులు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనియెడల ప్రభుత్వ భూములన్నీ కబ్జాదారుల చేతిలోకి వెళ్లిపోయి కబ్జాలు చేస్తూ పెద్ద పెద్ద బిల్డింగులు కడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం గా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ ప్రాంతంలో ఎక్కడ,ఉన్న ప్రభుత్వం భూమి, గుర్తించి అర్హులైన పేద ప్రజలకు పేదలందరికీ ఇళ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,లేనియెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలే రమేష్. ప్రణయ్. రాజేశ్వరి. శ్రావణి. సైదమ్మ. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహేశ్వరం గడ్డ కాంగ్రెస్ అడ్డ -- కేఎల్ఆర్ గెలుపే లక్ష్యం: అందుగుల సత్తన్న



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం బైరగూడ గ్రామ ప్రజలకు,మండల నాయకులకు అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.గతంలో కొన్ని అనివార్య కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీని వీడి తెలంగాణ జాగృతి పార్టీలో చేరాను.అయితే ఆ పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడంతో, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.మా ఊరిలో రాజకీయాలు కుళ్లిపోవడంతో,నిజమైన అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నమ్ముతున్నాను.కేఎల్ఆర్ మంచి నాయకుడు.అభివృద్ధి కొనసాగాలంటే ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలి.మళ్లీ రేవంత్ రెడ్డి సీఎం కావాలి.ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం అత్యవసరం.కాంగ్రెస్ పార్టీని వదిలానని చెప్పుకుంటున్న సత్తన్న బైరా కూడా సర్పంచ్,రిటైర్డ్ ఎస్సై ప్రోత్సాహంతో మంచి పనుల కోసం కాంగ్రెస్‌లో చేరాను.గ్రామ ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.చిన్న ఆపద వచ్చినా ఆదుకునే నాయకత్వం కాంగ్రెస్ పార్టీకే సాధ్యం.రాబోయే ఎన్నికల్లో కేఎల్ఆర్ ని ఎమ్మెల్యేగా గెలిపించి,మంత్రి పదవిలో కూర్చోబెట్టడమే మా లక్ష్యం.కేఎల్ఆర్ గెలుపే మా ధ్యేయం.మహేశ్వరం గడ్డ కాంగ్రెస్ అడ్డ అని సత్తన్న తెలిపారు.

# సమస్యల వలయంలో నర్సంపేట గర్ల్స్ హై స్కూల్

**- గర్ల్స్ హైస్కూల్ కు టాయిలెట్స్ నిర్మించాలి**
**- ఏ ఐ ఎఫ్ డి ఎస్ ఆధ్వర్యంలో గర్ల్స్ హైస్కూల్ సందర్శన**
**- విద్యాశాఖ అధికారులు స్పందించాలి**



**హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్/వరంగల్ :**
నర్సంపేట పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ ప్రభుత్వ పాఠశాల సమస్యల సుడిగుండంలో విలయతాండవం చేస్తుందని ఏ ఐ ఎఫ్ డి ఎస్ ( అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య) వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండిపడ్డారు ఈ సందర్భంగా సోమవారం రోజున నర్సంపేట పట్టణంలో ఉన్నటువంటి గర్ల్స్ హైస్కూల్ ప్రభుత్వ పాఠశాలను ఏ ఐ ఎఫ్ డి ఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య )ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది అనంతరం ఏ ఐ ఎఫ్ డి ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జన్ను రమేష్ చుక్క ప్రశాంత్ లు మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు అదేవిధంగా అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆరవ తరగతి విద్యార్థులకు కనీసం క్లాసు రూమ్ లేకపోవడం వలన ఇప్పటికే వారు చెట్ల కింద కూర్చొని చదువుకుంటున్నారని ఆ విద్యార్థులకు క్లాస్ రూములు నిర్మించాలని కోరారు అదేవిధంగా సుమారు నాలుగు మంది విద్యార్థులు చదువుతున్న ఆ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ లేకపోవడం అనేది సిగ్గుచేటు అని అన్నారు అదేవిధంగా ఉన్నటువంటి టాయిలెట్స్ కు శుభ్రం లేకపోవడం కారణంగా మరియు ఉన్నవాటికి డోర్లు కూడా లేనటువంటి పరిస్థితి ఉంది అదేవిధంగా నీళ్లు వృధాగా పోతూ ఆట స్థలంలోకి వచ్చి ఆటస్థలమంతా కూడా బురదమయంతో ఉన్నది కనీసం ఆ నీరు అంతా కూడా భూమిలోనికి ఇంకెటట్టు ఇంకుడు గుంతలు నిర్మించాలని వారు కోరారు మరియు విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు లేవని మండిపడ్డారు ఒక్కో క్లాస్ రూముకు నాలుగు ఫ్యాన్లు ఉండేవి కానీ అందులో ఒక ఫ్యాన్ మాత్రమే ఉందని దీని వలన విద్యార్థులు రాబోయే ఎండాకాలంలో నానా అవస్థలు పడే అవకాశం ఉందని అన్నారు మరియు సెవెంత్ క్లాస్ విద్యార్థులకు డిజిటల్ ప్రొజెక్టర్ ఉన్నా కూడా అది ఉపయోగం లేనిదిగా అక్కడ ఉన్నది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అనేక సమస్యలతో నర్సంపేట గర్ల్స్ హై స్కూల్ ప్రభుత్వ పాఠశాల విలయతాండవం చేస్తుందని అన్నారు కాబట్టి తక్షణమే స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి నర్సంపేట గర్ల్స్ హై స్కూల్ ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రధానంగా విద్యార్థులకు మూత్రశాలలు నిర్మించాలని అన్నారు విద్యార్థులు ఆట స్థలంలో కూర్చుని భోజనం చేస్తున్నారని కాబట్టి విద్యార్థులకు డైనింగ్ హాల్ నిర్మించాలని అన్నారు కన్స్ట్రక్షన్ లో ఉన్న బిల్డింగ్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు లేనియెడల పెద్ద ఎత్తున ఏ ఐ ఎఫ్ డి ఎస్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వరుణ్ తేజ్ తరుణ్ చరణ్ జాన్ వర్షిత్ పల్లవి సుగుణ మానస అఖిల తదితర విద్యార్థులు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ రెడ్డి పై మూసీ సుందరీకరణ బాధితుల ఫైర్



**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-**
అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర ఏళ్లలో ప్రజల కోసం చేసిన ఒక్క మంచి పనైనా ఉందా రేవంత్ రెడ్డి? హైడ్రా పేరుతో పేదవాళ్ల ఇళ్లను కూల్చడం, మూసీ సుందరీకరణ సాకుతో సామాన్యులను రోడ్డున పడేయడం తప్ప మీరు చేసింది ఏంటి మేనిఫెస్టోలోని హామీలను గాలికొదిలేశారు. కోట్లాది రూపాయల విలువైన ప్రైమ్ ల్యాండ్‌ల మీద ఉన్న శ్రద్ధ ప్రజల మీద ఎందుకు లేదు? ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేశామని గర్వంగా చెప్పగలరా అని మూసి బాధితులు అన్నారు.

# నైపుణ్యాల మెరుగుతోనే ఉజ్వల భవిష్యత్

**- ఆర్ బీవిఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుత దేవి**




**హైదరాబాద్, ఫిబ్రరి 23:**
విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని హెచ్ఎంవిఎస్ కార్యాదర్శి ప్రొఫెసర్ ముత్యం రెడ్డి అన్నారు. ఆర్ బివిఆర్ఆర్ మహిళా కళాశాల బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అచ్యుతదేవి మార్గదర్శకత్వంలో అండర్ - 25 సమ్మిట్ రెండు రోజుల పాటు నారాయణగూడ లోని కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అచ్యుతదేవి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైనదని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. రోజురోజుకు శాస్త్రసాంకేతిక రంగాల్లో విస్తృతమవుతున్న అవకాశాలను ప్రొఫెషన్ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని అన్నారు. నెగిటివ్ ఆలోచనలకు స్వస్తి చెప్పి గ్లోబల్ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిలాజ, కో కన్వీనర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. అనూష, వైధికారెడ్డి, సుమతి, శ్రీచరిత, కెవిన్ నోయెల్, అరకులా లోకేష్, నిఖిల్, హితేష్, సూర్య దుబే, హాసిని, దిశాంత్, అనురాగ్ ముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

## యల్ బి నగర్ శ్రీనివాస కాలనీలో నూతన సి సీ రోడ్లు నిర్మాణము. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్..

- నారోజు శ్రీనివాస చారీ......



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి :సెక్రెటరీయేట్**
శ్రీనివాస కాలనీ అసోసియేషన్ చొరవతో కాలనిలో సి సి రోడ్డు పనుల ప్రారంభోత్సవము ఘనంగా జరిగింది. ఈ పనులను కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మరియు వారి కార్యవర్గ సభ్యులు కలిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినారు. ఇది కాలనీ వాసులకు మెరుగైన, సౌకర్యవంతమైన రవాణాను కలిపిస్తుందని, కాలనీ సౌందర్యరీకరణ కు తోడుపడుతుందని వారు పేర్కొన్నారు. ఇట్టి రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారోజు శ్రీనివాస చారీ, సెక్రటరీ సుబ్బయ్య, కోశాధికారి సంపంత్ గౌడ్, ఉపాధ్యక్షుడు భీంరాజ్, మరియు వారి కార్యవర్గ సభ్యులు జంగారెడ్డి, మల్లేష్, నగేష్,రవి,శ్రీనివాసరెడ్డి, రమేష్, వేణుగోపాల్ చారీ, కాలనీ పెద్దలు గాలయ్య,ప్రభాకర్, మహిపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.కాలనీ వాసులు సంతోషం వెలిబుచ్చినారు

# రోడ్డు నియమాలు పాటించాలి.

- తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రావు

**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి )**
అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో మండలకేంద్రంలోవాహనదారులకు స్థానిక ప్రజలకు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని మద్దిరాల పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహరావు హాజరై రోడ్డు భద్రత పట్ల ప్రజలకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నివారించడం రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్కరు కూడా మరణించకూడదని సంకల్పంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల భద్రత పట్ల రోడ్డు భద్రత పట్ల ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. ప్రజలందరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని ప్రయాణ సమయంలో




జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆటోలపై పరిమితికి మించి ప్రయాణికులను రవాణా చేయకూడదని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలలో పెద్దదిక్కుని కోల్పోతే కుటుంబ సభ్యులు దిక్కుతోచక ఉంటున్నారని ఇలాంటి సందర్భాలు చాలా నమోదవుతు న్నాయని తెలిపారు. రోడ్డు ప్రయాణ సమయ ంలో ఏ ఒక్కరు కూడా ప్రాణాలు కోల్పోకూ డదని పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యం అని అన్నారు. కావున వాహనదారులు ప్రజలు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని. వేగంగా వాహనాలు నడపకూడదని మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని. స్థానిక ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కానిస్టేబుల్ వెంకన్న సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి

- తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.




**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మార్కెట్ యార్డులో "కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ "తుంబూరి దయాకర్ రెడ్డి, పాల్గొని లబ్దిదారులకు చెక్కులు అందించారు ,ఈ కార్యక్రమంలో అధికారులు, ఎండిఓ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు గారు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొడాలి గోవిందా రావు,నెల్లూరి భద్రయ్య, సర్పంచ్ లు, బోదులబండా సర్పంచ్ నాగార్జున్, కుక్కల నరేష్, రాణి,బోయిన వేణు,బచ్చలకూర నాగరాజు,కుక్కల హన్మంతరావు,మాదు,మదారు సాహెబ్,జెరిపోతుల అంజానీ ఉపేందర్ పసుపులేటి,కొడిరెక్క వినోద్,కొమ్మూరి నరేష్,వాకా శ్రీనాధ,మార్తి కోటి,రెడ్డి బోయిన నవిన్,వెంకన్న,నల్లాని మల్లికార్జున్,కోటేశ్వరరావు,పూర్ణ,కిషన్,జెర్రిపోతుల సత్యనారాయణ,వెంకటేశ్వర్లు, శేకర్, యల్లయ్య, నారాయణరావు, విరబాబు,రెడ్డి,గండు సతీష్, గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

# దేవుడి భూమిని కాజేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు

**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:**
రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామంలో శ్రీ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి పేరు మీద ఉన్న మూడు ఎకరాల ఎండోమెంట్ భూమిని దొంగ చాటున భారతీయ జనతా పార్టీ మాజీ ఎంపీటీసీ గౌర మల్లేష్ సతీమణి గౌర వసంత పైన తూలేఖర్ద్ రెవిన్యూ గల సర్వే నెంబర్ 98 /2 లో మూడు ఎకరాల భూమిని పట్టా చేసుకున్నారు.
శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిరక్షణ కమిటీ ధర్మన్నగూడ గ్రామ కమిటీ సభ్యులు అందరూ కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మన్నగూడ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూముల పరిరక్షణ కమిటీ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బండ మల్లేష్ మండల సత్యనారాయణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 98/2 లో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం పేరు మీద భూమి ఉందని తెలిపారు. ఈ భూమిని గత 20 సంవత్సరాల క్రితం నుంచి ఇప్పటివరకు మాజీ ఎంపీటీసీ గౌర



మల్లేష్ సాగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలంతా కలసి ఐక్యంగా పోరాడి ఆలయ భూమిని దక్కించుకోవాలని తెలిపారు మాజీ ఎంపీటీసీ గౌర మల్లేష్ ధర్మన్నగూడ గ్రామ ప్రజలందరికీ మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ భూమిని సర్వే చేసి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పేరు పేరు మీదికి తక్షణమే మార్చాలి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు శశిధర్ రెడ్డి మండల నరసింహ. మండల గోపాలకృష్ణ మండల జంగయ్య కొంపోజు సురేష్ చారి. బుడిగలి మల్లేష్‌బుర్రి వెంకటేష్ మండల నరేందర్ పాల్గొన్నారు.

# అడవి పశువులను తరలించి రైతుల పంటలను కాపాడాలి.

- మీరు తరలిస్తారా మమ్ములను తరలించుకో మంటారా..

**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి23:-**
మంచాల మండలం బండలేమురు గ్రామంలో అడవి పశువులు ఎక్కువై రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్నాయని వాటిని ప్రభుత్వ ఇక్కడ నుండి తరలించాలని కోరుతూ నేడు రంగారెడ్డి జిల్లా ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ.. గ్రామం పరిసర ప్రాంతంలో పశువుల బెడద ఎక్కువైందని దీని కారణంగా పది సంవత్సరాలుగా రైతులు పంటలను పండించుకునే పరిస్థితి లేకుండా అయిందని అన్నారు. గ్రామంలోని అనేక మంది రైతులు తమ పంట పొలాల్లో పశువుల బెడదతో పంటలు వేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా పంటలు వేసుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాత్రిపూట పశు వుల బెడద నుండి పంటలను కాపాడుకోవడానికి రాత్రనకా పగలనకా కాపు కాసిన రక్షణ లేకుండా పోతుంది. 10 సంవత్సరాలుగా 100 పశువుల దాకా ఉన్నాయని వాటి వలన పంటలు వేసుకోలేకపోతున్నాము. తమ పొలాల్లో పంటలు వేయకుండా బీడులుగా మారి ప్రభుత్వము నుంచి వచ్చే రైతు భరోసా పథకం కూడా వర్తించడం లేదని అన్నారు. రైతు భరోసా అందకపోయినా కనీసం పంట పండించుకొని కూటగడుపుకుందామన్న పరిస్థితి లేకుండా పోయింది. అట్టి పశు వులను ఇక్కడి నుండి తరలించాలని పలుమార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గత పది సంవత్సరాలుగా పంటలను పశువులతోటి



కాపాడుకోలేక పోయాము ఇప్పుడు యాసింగులో కొద్దిపాటి వరి నాట్లను వేసుకోవడం జరిగింది. వేసిన కొద్ది రోజుల్లో నే అట్టి వరిచేల ను వెంటనే పశువులు మేసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా అక్కడి పశువులను ఇక్కడినుండి తరలించి గోషాలకా ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నాము. ఒకవేళ ప్రభుత్వ అధికారులు తరలించని యెడల రైతులు తరలించుకోవడానికి అనుమతి అయినా ఇస్తే వాటిని మేమే తరలిస్తామని అందుకు పర్మిషన్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బండలేమూర్ మాజీ వార్డ్ మెంబర్ జాపాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సృష్టి కేసులో కీలక పరిణామం.. డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అనుమతించిన కోర్టు..




**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** సృష్టి సరోగసీ అక్రమాల కేసులో ( ) అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (జుణ) దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది. ఈ కేసు సరోగసీ పేరుతో అక్రమాలు, హవాలా, మనీలాండరింగ్ ఆరోపణలతో సంబంధం ఉండటంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.రెండు రోజుల కస్టడీకి అనుమతి..
డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోర్టును కోరింది. అయితే కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. రెండు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం రేపు(మంగళవారం), ఎల్లుండి(బుధవారం) రెండు రోజుల పాటు ఈడీ అధికారులు డాక్టర్ నమ్రతను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెలికితీసే ప్రయత్నం చేయనున్నారు.
సరోగసీ పేరుతో అక్రమాల ఆరోపణలు..
డాక్టర్ నమ్రతపై సరోగసీ సేవల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా, అక్రమంగా సరోగసీ వ్యవస్థను ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం.
హవాలా, మనీలాండరింగ్ కోణంలో విచారణ
ఈ కేసులో ముఖ్యంగా హవాలా, మనీలాండరింగ్ అంశాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. డాక్టర్ నమ్రత భారీ మొత్తంలో డబ్బు సేకరించి, హవాలా మార్గం ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబ్బు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై ఈడీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టనున్నారు.
కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం
ఈడీ కస్టడీ విచారణలో.. అక్రమంగా సేకరించిన డబ్బు తరలింపు మార్గాలు, ఇందులో పాల్గొన్న ఇతర వ్యక్తులు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో మరికొందరు వ్యక్తులు కూడా ఉన్నారా అన్న దానిపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సరోగసీ వ్యవస్థను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసు ద్వారా అక్రమంగా జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## అకాల వర్షంతో రైతన్నకు అపార నష్టం.. ఆదుకునేది ఎవరు..





**రాయపోల్ ఫిబ్రవరి 23** సిద్దిపేట జిల్లాలో అకాల వర్షం రైతన్నలకు కన్నీరు మిగిల్చింది. రాయపోల్, దౌల్తాబాద్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. చేతికొచ్చిన మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలతోపాటు కూరగాయ పంటలు దెబ్బతినడ ంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. కష్టపడి పండించిన పంటలు కండ్ల ముందే నేల రాలడంతో రైతాంగం లబోదిబోమ ంటోంది.అల్పపీడనం ప్రభావంతో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం పలు పంటలకు తీవ్రంగా నష్టపరిచింది. కొత్తపల్లి, రాయపోల్, తిమ్మక్కపల్లి, అనాజిపూర్, మంతూర్, రామారం, గొల్లపల్లి, దౌల్తాబాద్ మండలంలోని అహ్మద్నగర్, ముబారస్ పూర్తి, దొమ్మాట, గాజులపల్లి... తదితర గ్రామాల్లో వర్ష తీవ్రతకు చేతికి వచ్చిన పంటటు నేల రాలిపోయాయి.
పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు మండల కేంద్రంలో సుమారు 5 గంటల పాటు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షానికి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించి నివేదికలు తయారుచేసి జిల్లా అధికారులకు అందించి పరిహారం అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం
# విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్




**హైదరాబాద్ :** మరో రెండు రోజుల్లో ఇంటర్మీడియట్? పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీనికోసం ఇంటర్ బోర్డ్? అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసింది. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్మీ డియట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇంటర్ బోర్డ్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుందని, కానీ పరీక్షా సమయానికి గంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు : మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, అందులో మొదటి సంవత్సరం 4,89,126 మంది, రెండో సంవత్సరం రెగ్యులర్? విద్యార్థులు 4,53,932 మంది పరీక్షలు రాస్తున్నట్లు వెల్లడించారు. రెండో సంవత్సరం ప్రైవేటు 54,017 మంది కలిపి మొత్తం 5,07,949 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షల సిబ్బంది ఇలా : ఇంటర్? పరీక్షల కోసం 1,495 ఎగ్జామి నేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కృష్ణ ఆదిత్య వెల్లడించారు. చీఫ్ సూపరింటెండెంట్స్ 1,495 మంది, డిపార్ట్?మెంట్ ఆఫీసర్లు 1,495 మంది విధుల్లో ఉంటారని తెలిపారు. మొత్తం 28,500 మంది ఇన్విజిలేటర్లు, 75 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 200 సిట్టింగ్ స్క్వాడ్స్ విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులతో, పోలీస్ అధికారులు, పోస్ట్ ఆఫీస్ సిబ్బందితో కలిసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు."ఇంటర్మీడియట్ పరీక్షలను ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్నాం. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. అయినా పరీక్షా సమయానికి గంట ముందుగా విద్యార్థులు ఎగ్జామ్? సెంటర్‌కు హాజరుకావాలి. ఆర్టీసీ అధికారులతో, పోలీస్ అధికారులు, పోస్ట్ ఆఫీస్ సిబ్బందితో కలిసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ సదుపాయాలు కల్పిస్తు న్నాం." – కృష్ణ ఆదిత్య, ఇంటర్ బోర్డ్ సెక్రటరీవిధుల డియట్ పరీక్షల విధుల నుంచి ప్రాథమిక పాఠశాల (పీఎస్), ప్రాథమికోన్నత పాఠశాలల (యూపీ) ఉపాధ్యా యులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ (టీజీ హెచ్ఎంఏ) ఫిబ్రవరి 22న ఓ ప్రకటనలో తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం 2, 3 తరగ తుల విద్యార్థులకు ఎన్‌సీఆర్‌టీ ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపింది. దీనితో పాటు పీటీఎం సమావేశాలు, ఇతర బాధ్యతలతో ఉపాధ్యాయులు తీరిక లేకు ండా శ్రమిస్తున్నారని చెప్పింది. దీనిని దృష్టిలో ఉంచుకుని పీఎస్, యూపీఎస్ ఉపాధ్యాయులను ఇంటర్మీడియట్ పరీక్షల విధుల నుంచి , ప్రధాన కార్యదర్శులు రాజభా ను, హేమచంద్రుడు, పి.సత్యనారాయణ, చంద్రప్రకాశ్, మురళీకృష్ణ కోరారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి అస్వస్థత



**కామారెడ్డి, ఫిబ్రవరి 23:** కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణా రెడ్డి(సోమవారం) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత రెండు మూడు రోజులుగా కామారెడ్డిలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల ఒత్తిడి నేపథ్యంలో ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల బందోబస్తు నడుమ గృహ నిర్బంధంలో ఉండగా.. డాక్టర్లు ఆయన ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించి జరుగుతున్న గొడవ.. సవాళ్లు, ప్రతి సవాళ్లకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆరోగ్యంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. మరికొన్ని రోజుల పాటు ఆయనకు విశ్రాంతి అవసరమని సూచించారు.

# హైదరాబాద్‌లో స్పెషల్ పోలీస్ ఉద్యోగాలు




**హైదరాబాద్ :** నగర పరిధిలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ ఉద్యోగాలకు పోలీస్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. తాత్కాలిక ప్రాతిపదికన మొత్తం 138 మంది స్పెషల్ పోలీస్ ఆఫీసర్లను నియమించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఈ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లకు నెలకు రూ.26 వేల వేతనం అందించనున్నారు. రిటైర్డ్ పోలీస్ సిబ్బంది, మాజీ సైనికులు, మాజీ పారామిలిటరీ దళాల్లో పనిచేసిన వారు మాత్రమే అర్హులు అని తెలిపింది. రాతపరీక్ష లేకుండా.. విద్యార్హతలు, స్థానికత, ఉద్యోగ అనుభవం ఆధారంగా నేరుగా ఉద్యోగం ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది.ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి నివాస ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ శాఖ తెలిపింది. దరఖాస్తులను సమర్పించేందుకు చివరి తేదీ మార్చి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అని ప్రకటించింది.ఇక ఈ హైదరాబాద్ సిటీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల్లో మాజీ సైనికులకు వయసు పరిమితి.. 2026 జనవరి 31వ తేదీ నాటికి 58 సంవత్సరాల కంటే తక్కువ ఉండాలి. అలాగే గత 2 ఏళ్లలో తమ ఉద్యోగాల నుంచి విరమణ చేసి ఉండాలి. ఇక మాజీ పారామిలిటరీ, రిటైర్డ్ పోలీసు సిబ్బందికి 62 సంవత్సరాల వరకు గరిష్ఠ వయోపరిమితిని విధించారు.

# సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం
# 'ఖాకీ కిడ్స్ ' కార్యక్రమానికి శ్రీకారం




**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు సైబర్ నేరాల నియంత్రణకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖాకీ కిడ్స్? పేరిట కార్యక్రమాన్ని రూపొందించారు. దీని ఉద్దేశం ఏంటంటే రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ప్రజలను అప్రమత్తం చేయడం. సైబర్ నేరాలు జరిగే విధానం, ఓటీపీ మోసాలు సోషల్ మీడియాలపై అవగాహన కల్పిస్తున్నారు.జిల్లా పోలీసు శాఖ నూతన కార్యక్రమం : తాజాగా పాఠశాలలో విద్యార్థులు చిన్నప్పటి నుంచే రహదారి నిబంధనలు పాటించడం, అలాగే సోషల్ మీడియా ద్వారా చెడు మార్గాలు వైపు వెళ్లకుండా తదితర వాటిపై అవగాహన కల్పిస్తే రాబోయే కాలంలో మంచి పౌరస మాజ స్థాపన సాధ్యమవుతుందన్న ఆలోచనతో జిల్లా పోలీసు శాఖ మరో నూతన కార్యక్రమానికి ముందడుగేసింది. దీనికి ఎస్పీ అఖిల్ మహాజన్ ఖాకీ కిడ్స్ పేరిట కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు.పాఠశాల విద్యార్థులకు అవగాహన : రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటికే వివిధ కార్యక్రమాలను ఇప్పటికే అమలు చేస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తాజాగా ఖాకీ కిడ్స్ పేరిట మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాఠశాలల విద్యార్థులతో సమావేశం నిర్వహించి సైబర్? క్రైమ్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్? లేకుండా వాహనాలు నడపరాదని, పిల్లల తల్లిదండ్రులు వారికి తగిన జాగ్రత్తలు సూచించారు. దాని ద్వారా ప్రమాదాలు నివారించవచ్చాన్నారు. ఈ నేపథ్యంలో ఖాకీ కిడ్స్ గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 19 పోలీస్? స్టేషన్ ఒక్కొక్క కానిస్టేబుల్?కు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న కానిస్టేబుల్ వారంలో మూడు పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు పై అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా మైనర్లు వాహనాలు నడిపితే జరిగే నష్టాలను తెలియజేయనున్నారు. ప్రత్యేక బ్యాడ్జీ : సైబర్ నేరాల నివారణపై తల్లిదండ్రులు, ప్రమాదాల నియంత్రణ, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి వాటిని పాటించేలా చేసిన వారిని కొద్ది రోజులు గుర్తించనున్నారు. అలాంటి వారికి 'ఖాకీ కిడ్స్ పేరిట ప్రత్యేక బ్యాడ్జీలను ఎస్పీ బహుకరించారు.బాధ్యతలు ఇవే :రహదా రి నిబంధనలు పాటించనట్లయితే జరిగే ప్రమాదాలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అవాస్తవ ప్రకటనలు తదితరాలను వారిని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులను ఖాకీ కిడ్స్?గా సిద్ధం చేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.తల్లిదండ్రులతో వెళ్లినప్పుడు హెల్మెట్ పెట్టుకోవడం, సీటు బెల్టు పెట్టుకోవటం, అతి వేగంగా వెళ్లకుండా నిరోధించడం, సైబర్? నేరాల బారిన పడకుండా ఉండేలా వారికి సూచనలు చేసేలా అవగాహన కల్పించనున్నారు.వీటి ద్వారా ప్రమాదాలు, సైబర్ మోసాల నియంత్రణతో పాటు భవిష్యత్తులో నియమ నిబంధనలకు అలవాటు పడేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "ప్రమాదాల నియంత్రణ చర్యలు, రహదారి నిబంధనల, సైబర్ నేరాల వైపు వెళ్లకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నప్పటి నుంచే పిల్లలకు అవగాహన ఉంటే రహదారి మరణాలు, సైబర్ నేరాలను పకడ్బందీగా నియంత్రించవచ్చు. ఇలా చేయడం వల్ల గత రెండు, మూడేళ్లలో మంచి ఫలితాలు వస్తాయి." – ఎస్పీ అఖిల్ మహాజన్

# ఆదిలాబాద్‌లో ఘోర ప్రమాదం..
# వాగులో పడిపోయిన ఆర్టీసీ బస్సు



**ఆదిలాబాద్ జిల్లా :** ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వాగులో పడిపోయింది. ఈ ఘటన ఉట్నూరు మం డలం శ్యామ్‌పూర్ గ్రామం వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం ఆదిలాబాద్ బయల్దేరింది. శ్యామ్‌పూర్ వద్దకు చేరుకోగానే.. అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టి వాగులో పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులోని డ్రైవర్, కండక్టర్‌తో పాటు 30 మందికి ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు వాగులోకి దూసుకెళ్లగానే.. ప్రయా ణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. రోడ్డుపై వెళ్లే మిగతా ప్రయాణికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ఆ తర్వాత పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. బస్సులు అద్దాలు పగులగొట్టి కిటికీల ద్వారా బయటకు తీసుకొచ్చి 108 వాహనాల్లో చికిత్స నిమిత్తం ఉట్నూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గాయపడిన వారికి చికిత్స అందుతుండగా.. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా డాక్టర్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం వారిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమా..? లేక సాంకేతిక లోపమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ ముమ్మరం చేశారు.మంచిర్యా లలోనూ మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్లో డిప్యూటీ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎండీ నసీరుద్దీన్ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆయన కూతురు, మనవరాలితో పాటు కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఇస్లాంపురకు చెందిన నసీరుద్దీన్ నిర్మల్‌లో తన కూతురు నేహా షరీన్, ఇరా హరీన్‌లను కారులో ఎక్కించుకొని మంచిర్యాల బయల్దేరారు. కడెం మండలం దోస్తునగర్ వద్దకు చేరుకోగానే.. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో ముందు సీట్లో కూర్చున్న నసీరుద్దీన్ తీవ్రంగా గాయపడి స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. నేహా షరీన్, ఇరా హరీన్, డ్రైవర్ బిలాలుద్దీన్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేస నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# 154 శాతం పెరిగిన ట్రాఫిక్ చలాన్ల ఆదాయం ప్రజాపాలన
# కాదు, పెనాల్టీ పాలన అంటూ బండి సంజయ్ ట్వీట్



**హైదరాబాద్ :** తెలంగాణలో ట్రాఫిక్ చలాన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరిగినట్లు లెక్కలు వెల్లడి కావడంతో.. రేవంత్ రెడ్డి సర్కార్‌పై.. బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆరో పణలు గుప్పించారు. ఇది ప్రజా పాలననా.. పెనాల్టీ పాలననా అంటూ తీవ్రంగా ఫైర్ అయ్యారు. కేవలం ఒక సంవత్సర కాలం లోనే ట్రాఫిక్ చలాన్ల వసూళ్లు 154 శాతం పెరగడం పట్ల కేంద్ర మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతేడాది ట్రాఫిక్ చలాన్ల ద్వారా సర్కారుకు రూ.108.33 కోట్ల ఆదాయం సమకూరగా.. అది ఈ ఏడాది ఏకంగా రూ. 275.05 కోట్లకు పెరగడంపై రేవంత్ రెడ్డి సర్కార్‌ను బండి సంజయ్ ప్రశ్నించారు.ఈ లెక్కలు చూస్తుంటే గత ఏడాది కాలంలోనే ట్రాఫిక్ జరిమానాల ద్వారా రాష్ట్ర ప్రభు త్వానికి వచ్చే ఆదాయం 154 శాతం అంటే దాదాపు 2.5 రెట్లు పెరిగినట్లు ఆయన లెక్కలతో సహా వెల్లడించారు. ఇక ప్రజల నుంచి ఫైన్ల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. వారికి సరైన సౌకర్యాలు కల్పిస్తుందా అని రేవ ంత్ రెడ్డి ప్రశ్నించారు. చలాన్ల ద్వారా భారీగా ఆదాయం పెరిగిన ప్పుడు.. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు కూడా అదే స్థాయిలో మెరుగు పడ్డాయా అని నిలదీశారు.రోడ్లపై గుంతలు లేకుండా చేశారా.. ట్రాఫిక్ ఏమైనా తగ్గిందా అని అన్నారు. ప్రజలకు, వాహన దారులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండానే.. కేవలం ట్రాఫిక్ చలాన్లు వేసి.. వారి నుంచి డబ్బులు మాత్రమే వసూలు చేయడంపై దృష్టి పెట్టడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సామాన్య ప్రజలను రేవంత్ రెడ్డి సర్కార్ ఒక వాకింగ్ ఏటీఎం లాగా వాడుకుంటోందని ఆరోపించారు.మరోవైపు.. ప్రజల వాహనాలపై పడిన ట్రాఫిక్ చలాన్‌లను నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ల నుంచే ఆటో డెబిట్ చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనను బండి సంజయ్ తీవ్రంగా తప్పు పట్టారు. మొదట జరిమానాలను పెంచారని.. ఆ తర్వాత ట్రాఫిక్ పోలీసులకు టార్గెట్లు పెట్టి మరీ చలాన్లు వేయించారని.. ఇక ఇప్పుడు నేరుగా ప్రజల ఖాతాల నుంచి డబ్బులు కట్ చేయాలని చూడటం ఆటోమేటెడ్ దోపిడీలా ఉందని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ అన్ని నిర్ణయాలను రేవంత్ సర్కార్ పునరాలోచించుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# అమ్మాయిలూ జాగ్రత్త పెళ్లి పీటలు ఎక్కేవరకు అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్ :** పెళ్లి పేరుతో మోసాలు జరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అమ్మాయిలను హెచ్చరించారు. కొందరు కేటుగాళ్లు పక్కాగా స్కెచ్ వేసి డబ్బుల కోసం మోసాలకు పాల్పడుతున్నారని.. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలంటున్నారు. పెద్దలు కుదిర్చిన సంబంధం అయినా సరే మాయగాళ్లు మోసాలు చేస్తున్నారని అలాంటి వారితో అలర్ట్‌గా ఉండాలంటూ ట్విట్టర్ ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేశారు.'హైదరాబాద్‌లో పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం ప్రేమ పేరుతోనే కాదు, పెద్దలు కుదిర్చిన సంబంధాల మాటున కూడా కొందరు నయవంచకులు యువతులను మోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలపై ఇటీవల హైదరాబాద్ షీ టీమ్స్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి.ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, ఆపై ఎంగేజ్‌మెంట్ జరిపించుకుంటున్నారు. పెళ్లి ఖాయమైంది కదా అనే చనువుతో యువతులకు దగ్గరవుతున్నారు. ఎలాగూ పెళ్ళే కదా.. ఇప్పుడైతే ఏంటి? అని మాయమాటలు చెప్పి, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి ఒత్తిడితో శారీరకంగా లోబచుకుంటున్నారు. తీరా తమ కోరిక తీరాక అసలు రంగు బయటపెడుతున్నారు. పెళ్లి పీటలు ఎక్కాలంటే తమకు భారీగా డబ్బు కావాలని, అదనపు కట్నం ఇస్తేనే తాళి కడతామని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెళ్లి రద్దు చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారు.నిశ్చతార్ధం జరిగిపోవడం, బంధుమిత్రులందరికీ తెలిసిపోవడంతో ఇప్పుడు పెళ్లి ఆగిపోతే సమాజంలో తమ పరువు ఎక్కడ పోతుందోనన్న భయంతో చాలామంది యువతులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కేటుగాళ్లు, అడిగినంత డబ్బు ఇవ్వాలంటూ వేధిస్తున్నారు. పరువు పోతుందని భయపడి మౌనంగా ఉంటే, జీవితాంతం నరకం అనుభవించాల్సి వస్తుంది. నిశ్చితార్థం అయినా సరే, పెళ్లి పీటలు ఎక్కేవరకు అప్రమత్తంగా ఉండాలి.పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా అని గుడ్డిగా నమ్మొద్దు. అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై ఆరా తీయండి. పెళ్లికి ముందే ఏకాంతంగా కలవడానికి, శారీరక సంబంధానికి ఒత్తిడి చేస్తే కచ్చితంగా అనుమానించండి, ధైర్యంగా తిరస్కరించండి. డబ్బు డిమాండ్ చేసినా.. బ్లాక్ మెయిల్ చేసినా భయపడవద్దు. ఫిర్యాదు చేయండి. మోసగాళ్ల చేతిలో చిక్కుకున్న వారు ఎలాంటి భయం లేకుండా ముందుకు రావాలి. మీ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555కు గానీ, డయల్ 100కు గానీ కాల్ చేయండి.' అని సజ్జనార్ ఆడ పిల్లలకు సూచించారు.

# బీసీలకు 80శాతం సబ్సిడీతో 20లక్షల రుణమివ్వాలి



**బర్కత్‌పుర:** బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక్కో బీసీ కుటుంబానికి 80శాతం సబ్సిడీతో రూ.20లక్షల రుణాలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో రుణాలపై నిర్ణయం తీసుకోవాలని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయి ంచాలన్నారు. బీసీ కార్పొరేషన్‌కు రూ.13 వేల కోట్లు, 21 బీసీ కులాల ఫెడరేషన్లకు రూ.8 వేల కోట్లు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ.8,500 కోట్లు తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్ అధ్యక్షతన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్ సమన్వయంతో కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. వచ్చే బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రూ.25 వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గాంధీ విగ్రహం రూ.5000 కోట్ల కాంట్రాక్ట్ ఇస్తే చేస్తానంటున్న ఎంవీ రమణా రెడ్డి




కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5000 కోట్లతో మూసీ నది ఒడ్డున దేశంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారీ గాంధీ విగ్రహం పెట్టాలన్నరేవంత్ ప్రభుత్వం నిర్ణయం పట్ల ప్రజల నుండి , ప్రజా సంఘాల నుండి, పర్యావరణవేత్తల నుండి, రాజకీయ పార్టీల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా లెక్కచేయడం లేదు. ప్రజాభిప్రాయాలకు వ్యతిరేకంగా మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మూసీ బాధితులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఓ వైపు మాకు నిలువనీడ లేకుండా చేస్తున్నారని మూసీ బాధితులు కన్నీరు పెడుతుంటే.. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్‌లో ఇల్లు కోల్పోతున్న, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేసిన నిర్మాత ఎం.వీ రమణా రెడ్డి మాటలు మాత్రం ఇవేం పట్టనట్టుగా ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వం నన్నడిగితే తప్పకుండా ఒక ఉన్నతమైనట్వంటి శిల్పాన్ని ప్రపంచం ఆశ్చర్యపోయేలా తీర్చిదిద్దే బాధ్యత నాది. తప్పకుండా నేనా పని చేస్తా.. కానీ ఇప్పటివరకు నన్ను ఎవరు స్పందించలేదు. రూ.5000 కోట్ల గాంధీ విగ్రహం కాంట్రాక్ట్ నాకు ఇస్తే చేస్తా. కానీ ప్రభుత్వం నుండి ఇప్పటివరకూ నన్ను ఇంకా ఎవరూ అడగలేదన్నాడు.కాగా కష్టపడి సంపాదించిన సొమ్ముతో, బ్యాంకులో లోన్లు తీసుకొని ఎంతో ఇష్టంతో ఇల్లు కట్టుకుంటే.. అది కూల్చేస్తే మేమెలా బ్రతికేది..? మేము తీసుకున్న బ్యాంకు లోన్లు కూడా తీరిపోలేదు, మేమెలా బ్రతకాలి..

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876